క్లుప్తంగా

పంచాయతీ భవన నిర్మాణానికి స్థల పరిశీలన

గట్టు: మండలంలోని ముచ్చోనిపల్లెలో నూతనంగా నిర్మించనున్న గ్రామ పంచాయతీ భవనానికి సంబంధించి సోమవారం మాజీ ఎంపీపీ విజయ్‌కుమార్ స్థల పరిశీలన చేశారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో ముచ్చోనిపల్లె గ్రామానికి రూ.20లక్షలు పంచాయతీ భవన నిర్మాణానికి మంజూరైనట్లుగా మాజీ ఎంపీపీ తెలిపారు. గ్రామస్తులతో కలిసి పంచాయతీ భవన నిర్మాణానికి అనువైన స్థలాన్ని పరిశీలించారు. అంగన్‌వాడీ భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయించాలని గ్రామస్తులు మాజీ ఎంపీపీ దృష్టికి తీసుకొచ్చారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు నర్సింహులు, చిన్న గోవిందు, గ్రామస్తులు గోపాల్‌రెడ్డి, సోమశేఖర్‌రెడ్డి, ఆంజనేయులు, ప్రసాద్, పెద్ద హనుమంతు, కర్రెప్ప, వెంకటన్న, నర్సింహులు, సురేష్, వీరేష్ పాల్గొన్నారు.

యువకుడిపై మాజీ ఎంపీటీసీ దాడి


తీవ్రంగా గాయపడిన రామాంజనేయులు

ధరూరు: మండల కేంద్రానికి చెందిన రామాంజనేయులుపై మాజీ ఎంపీటీసీ దుబ్బన్న దాడి చేసిన సంఘటన చోటుచేసుకుంది. బాధితుల వివరాల ప్రకారం.. సోమవారం సాయంత్రం పొలం వద్దకు వెళ్తున్న రామాంజనేయులుపై గ్రామానికి చెందిన కురం దుబ్బన్న దాడి చేశాడు. పాత కక్షల కారణంగా దారికాచి కర్రతో దాడికి పాల్పడ్డాడు. ఈ మేరకు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కుటుంబ సభ్యులు ఆయనను గద్వాల ఏరియా ఆస్పత్రికి తరలించి చికిత్స చేయిస్తున్నారు. పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది.

కారు బోల్తా: ముగ్గురికి స్వల్పగాయాలు

అయిజ: మండలంలోని ఉత్తనూరు, తుపత్రాల గ్రామాల మధ్య రోడ్డుపై ప్రయాణిస్తున్న కారు బోల్తాపడి ముగ్గురికి స్వల్పగాయాలయ్యాయి. సోమవారం మంత్రాలయం నుంచి కర్నూల్‌కు కారు డ్రైవర్, ఇద్దరు ప్రయాణికులు వెళ్తుండగా, కారు అదుపుతప్పి రోడ్డుపక్కకు బోల్తాపడింది. బురుదపొలం కావడంతో ఎలాంటి ప్రమాదం జరగలేదు.

రోడ్డు ఇలా.. ప్రయాణించేదెలా?



అయిజ: పట్టణ సమీపంలోని కర్నూలు–రాయచూర్ రోడ్డు మోకాలులోతు గుంతలు పడ్డాయి. ప్రయాణానికి పూర్తిగా ప్రతికూలంగా మారింది. మోటార్ సైకిళ్లపై ప్రయాణించేందుకు కూడా ఇబ్బందిగా ఉంది. భారీ వాహనాలు అటువైపు రావాలంటేనే భయపడాల్సిన పరిస్థితి నెలకొంది. అంబులెన్స్‌లు వేగంగా వెళ్లేందుకు వీలుకాకపోవడంతో అత్యవసర వైద్యసేవలందించాల్సిన వారికి సమస్యలు తలెత్తుతున్నాయి. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రహరీ నిర్మించాలి

మల్దకల్: మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలకు పూర్తిస్థాయి ప్రహరీ నిర్మించాలని బాలికల తల్లిదండ్రులు కోరుతున్నారు. ఇటీవల కస్తూర్బా బాలికల పాఠశాలను జూనియర్ కళాశాలగా అప్‌గ్రేడ్ చేయడంతో విద్యార్థుల సంఖ్య పెరిగింది. దీంతో విద్యార్థులకు సరిపడు తరగతి గదులు, కనీస వసతులు సమకూర్చాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. పాఠశాల సమీపంలో అయిజ–గద్వాల ప్రధాన రహదారి ఉండటంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి పాఠశాలలో నెలకొన్న సమస్యను పరిష్కరించాలని తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కోరుతున్నారు.

పదికి ప్రత్యేక కసరత్తు ప్రారంభం


ధరూరు ఉన్నత పాఠశాలలో సోమవారం సాయంత్రం ప్రారంభమైన ప్రత్యేక తరగతులు వింటున్న పదో విద్యార్థులు

- రెండు నెలల ముందే ప్రారంభం
- 100శాతం ఫలితాల కోసం ప్రత్యేక తరగతులు
- పరీక్షలపై విద్యార్థుల్లో ఆందోళన తగ్గించేందుకు విద్యాశాఖ చర్యలు

పాఠశాల పేరు	విద్యార్థుల సంఖ్య	పరీక్ష కేంద్రాలు
ధరూరు	220	ధరూరు.
ఉప్పేరు	159	ఉప్పేరు
రేవులపల్లి	40	-
మార్లబీడు	51	-
అల్వలపాడు	29	
గార్లపాడు	18	
కేజీబీవీ ధరూరు	47	
మొత్తం 07 పాఠశాలలు	564	రెండు సెంటర్లు

ధరూరు: పాఠశాల స్థాయిలో కీలంగా మారిన పదో తరగతి పరీక్షలకు విద్యార్థులను సంసిద్ధం చేస్తున్నారు. 100శాతం ఉత్తీర్ణత దిశగా అధికారులు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. ప్రతిఏటా ఉదయం సాయంత్రం వేళల్లో ప్రత్యేక తరగతులు నిర్వహించడంతో పాటు గ్రూపు చర్చల ద్వారా సందేహాల నివృత్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఈసారి ముందుగానే క్లాసులు ప్రారంభించి విద్యార్థుల్లో భయాన్ని తొలగించనున్నారు. పరీక్షలు నిర్వహించేందుకు ప్రభుత్వం తేదీలను త్వరలోనే ఖరారు చేయనుండడంతో విద్యార్థుల్లో భయం మొదలైంది. ఆ భయాన్ని పోగొట్టడంతో పాటు వారిలో ఆత్మస్థైర్యాన్ని నింపేందుకు ఉపాధ్యాయులు అందుకనుగుణంగా ముందుకెళ్తున్నారు. మొదటి సారిగా బోర్డ్ ఎగ్జామ్స్ పరీక్షలు రాస్తుండడంతో ఉపాధ్యాయులు దీనిపై వివరించినా, విద్యార్థుల్లో కాసింత భయం ఉంటోంది. ఆ భయాన్ని తీసి వేసేందుకు ఈ సారి రెండు నెలల ముందే ప్రత్యేక తరగతులు ప్రారంభించారు.

ప్రత్యేక తరగతులు ప్రారంభం...

మండలంలోని అన్ని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో సాధారణంగా నవంబర్ నుంచి ఉదయం సాయంత్రం వేళల్లో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తారు. అయితే ఈ సారి మాత్రం సెప్టెంబర్ 1 నుంచే సాయంత్రం 4.15 గంటల నుంచి 5.15 గంటల వరకు క్లాసులు ప్రారంభించారు. మండలంలో నాలుగు ఉన్నత పాఠశాలలతో పాటు రెండు ఎంపీహెచ్ఎస్ పాఠశాలలు, ఒక కేజీబీవీ పాఠశాలతో కలిపి మొత్తం 564 మంది విద్యార్థులు పదో తరగతికి హాజరు కానున్నారు. ధరూరు, ఉప్పేరు పాఠశాలల్లో పదో తరగతి సెంటర్లు ఎప్పటి లాగే ఏర్పాటు చేయనున్నారు.

భయం పోతుంది..



ఈ సారి ముందస్తుగా స్పెషల్ క్లాసులు ప్రారంభం చేయడం చాలా సంతోషంగా ఉంది. పరీక్షల సమయంలో మాలో ఉన్న భయం పోగొట్టేందుకు ఈసారి రెండు నెలల ముందు క్లాసులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవడం చాలా బాగుంది. – దివ్య, 10వ తరగతి, ధరూరు

10/10 సాధిస్తా..



నేను రైతు కుటుంబం నుంచి వచ్చాను. చదువంటే ఏంటో దాని ప్రాధాన్యత ఏంటో అర్థమైంది. పట్టుదలతో చదువుకుంటున్నా. కచ్చితంగా 10/10 సాధిస్తానన్న నమ్మకం ఉంది. ఉన్నత చదువులు చదివి మంచి ఉద్యోగం చేయాలన్నది నా ఆశ. – శారద, 10వ తరగతి, ధరూరు

ప్రిపేర్ అవుతున్నా..



పదో తరగతి పరీక్షలకు ప్రిపేర్ అవుతున్నా. ఈ రోజు స్పెషల్ క్లాస్‌కు వెళ్లి పాఠాలు విన్నాం. ఉదయం నుంచి విన్న వాటిలో ఏ సందేహమున్నా నివృత్తి చేసుకునేందుకు ఈ క్లాసులు ఉపయోగపడతాయి. చదివింది బాగా గుర్తు ఉండాలంటే ఇష్టపడి చదవాలని ఉపాధ్యాయులు చెప్పారు. చదువుపై ప్రత్యేక దృష్టి పెడతాను. – గణేశ్, 10వ తరగతి, ధరూరు

పరీక్షలకు సంసిద్ధం



పదో తరగతి పరీక్షలకు విద్యార్థులను సంసిద్ధం చేస్తున్నాం. గత ఫలితాలను దృష్టిలో ఉంచుకుని మెరుగు కోసం అనుక్షణం కృషి చేస్తున్నాం. పాఠశాలల్లో ప్రస్తుతం సాయంత్రం వేళల్లో వత్తిడి లేని ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం. తల్లిదండ్రులు ఈ కొద్ది రోజులు పిల్లలకు ఇంటి వద్ద చదువుకునే వాతావరణం కల్పించాలి. – రవీంద్ర బాబు, ఎంఈఓ, ధరూరు

చాలా సంతోషంగా ఉన్నారు



పాఠశాలలో స్పెషల్ క్లాసులను సోమవారం ప్రారంభించాం. కలెక్టర్, ఉన్నత విద్యా శాఖ అధికారుల ఆదేశానుసారం ఈ క్లాసులను కొనసాగిస్తున్నాం. నవంబరు నుంచి తిరిగి ఉదయం, సాయంత్రం రెండు పూటల స్పెషల్ క్లాసులను నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నాం. విద్యార్థుల్లో పూర్తిగా భయం పోగొట్టేలా ఈ క్లాసులు ఉంటాయి. ఈ క్లాసులను ప్రతి విద్యార్థి సద్వినియోగం చేసుకుంటే పరీక్షలను సునాయసంగా రాయవచ్చు. – ప్రతాప్‌రెడ్డి, డీసీఈబీ సెక్రటరీ, ధరూరు

పిల్లలను పనిలో పెడితే చర్యలు తప్పవు

కేటీదొడ్డి: పిల్లలను బడికి పంపకుండా పత్తి పనులకు పంపిస్తే చర్యలు తప్పవని ఎంఈఓ వెంకటేశ్వర్‌రావు అన్నారు. సోమవారం మండలంలోని పాగుంట, ముసల్‌దొడ్డి, వెంకటాపురం గ్రామాలలో పత్తి పంటలలో పనులు చేస్తున్న బడిబయటి పిల్లలపై ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. కొంత మంది విద్యార్థులను గుర్తించి పాఠశాలకు తీసుకొచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాఠశాలలో హాజరుశాతం తక్కువ ఉండటంతో విద్యార్థుల తల్లిదండ్రుల వద్దకు వెళ్లి అవగాహన కల్పించారు. విద్యార్థులను పాఠశాలకు పంపాలని, ఎవరైనా సీడ్ పత్తికి పంపిస్తే తల్లిదండ్రులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సీఆర్‌పీ ఉపాధ్యాయులు, యుగంధర్, హెచ్ఎం రవి, రఘు, శ్వేత, సునిత ఉన్నారు.

బీసీ రిజర్వేషన్ల బిల్లు ఆమోదం చరిత్రాత్మకం


గద్వాలలో కాంగ్రెస్ నేతల చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న నాయకులు

గద్వాలటౌన్: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు వీలుగా అసెంబ్లీలో బిల్లును ఏకగ్రీవంగా ఆమోదించడం చరిత్రాత్మకమని ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్ పేర్కొన్నారు. బిల్లు ఆమోదంపై కాంగ్రెస్ నాయకులు సంబరాలు నిర్వహించారు. సోమవారం సాయంత్రం కృష్ణవేణి చౌరస్తాలో కాంగ్రెస్ అగ్రనాయకుల చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. పెద్ద ఎత్తున బాణాసంచా కాల్చారు. ఈ సందర్భంగా సంపత్‌కుమార్ మాట్లాడారు. జనాభా వాటా ప్రకారం బీసీలకు రాజకీయాల్లో అవకాశాలు కల్పించాలన్న రాహుల్‌గాంధీ ఆశయాలను నెరవేర్చే క్రమంలో మంచి పరిణామం జరిగిందని ఆనందం వ్యక్తం చేశారు.కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు శంకర్, నల్లారెడ్డి, ఇసాక్, శేక్షావలి, భాస్కర్ యాదవ్, సురేష్, యల్లప్ప, జగదీష్, రాజశేఖర్‌రెడ్డి, రవి, సత్యం, వెంకట్రామిరెడ్డి, రామకృష్ణ, ఆనంద్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

42శాతం బీసీ రిజర్వేషన్లు అమలు చేయాలి


తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న బీఎస్పీ నాయకులు

ఎర్రవల్లి: ప్రభుత్వం బీసీ రిజర్వేషన్లను 42శాతం అమలు చేసి చట్టం చేయాలని కోరుతూ బీఎస్పీ నాయకులు సోమవారం తహసీల్దార్ నరేశ్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీఎస్పీ మండలాధ్యక్షుడు రాముడు మాట్లాడుతూ బీసీ రిజర్వేషన్లకు బీఎస్పీ సంపూర్ణ మద్దతు అందిస్తుందన్నారు. ఎన్నికల సమయంలో బీజేపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు రిజర్వేషన్ల పేరుతో డ్రామాలు ఆడుతున్నాయని మండిపడ్డారు. కార్యక్రమంలో నాయకులు దేవన్న, శివన్న, తదితరులు ఉన్నారు.

శివాలయంలో ప్రత్యేక పూజలు


శివుడికి అభిషేకం చేస్తున్న భక్తులు

ఎర్రవల్లి: బీచుపల్లి పుణ్యక్షేత్రంలోని శివాలయంలో సోమవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. చుట్టు పక్కల ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో బీచుపల్లికి చేరుకొని భక్తిశ్రద్ధలతో శివాలయాన్ని దర్శించుకున్నారు. అనంతరం ధ్వజస్తంభం ముందు కొబ్బరికాయలు కొట్టి శివుడికి పంచామృత అభిషేకాలు నిర్వహించి మొక్కులను తీర్చుకున్నారు.

ముళ్లపొదలను తొలగించండి


పెద్దవాగులో అలుముకున్న ముళ్ల పొదలు

అయిజ: పట్టణంలోని ఉప్పలదొడ్డి పేట సమీపంలో ఉన్న పెద్దవాగులో ముళ్లపొదలు దట్టంగా వ్యాపించాయి. భారీ వర్షాలు కురిసినప్పుడు వరదనీరు ముందుకు వెళ్లేందుకు వీలులేక కల్వర్టు పైనుంచి పారుతోంది. దీంతో రాకపోకలు నిలిచిపోతున్నాయి. పెద్ద వాగులోని ముళ్లపొదలను తొలగించి వరద నీరు సాఫీగా ముందుకు వెళ్లే విధంగా చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు అధికారులను కోరుతున్నారు.

మధ్యాహ్న భోజనం నాణ్యతగా ఉండాలి


ధరూర్‌లో మధ్యాహ్న భోజనం పరిశీలిస్తున్న ఎంఈఓ రవీంద్రబాబు

ధరూరు: మండలంలోని ఆయా గ్రామాల్లోని పాఠశాలలను ఎంఈఓ రవీంద్రబాబు సందర్శించి విద్యా ర్థుల సామర్థ్యాలను పరిశీలించారు. సోమవారం మాల్‌దొడ్డి, మిర్జాపూర్, నీలహళ్లి ప్రాథమిక పాఠశాలలతో పాటు ధరూరు ఉన్నత పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా రికార్డులను, హాజరు రిజిస్టర్లను తనిఖీ చేశారు. విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించి ఉపాధ్యాయులతో మాట్లాడారు. విద్యార్థులకు మధ్యాహ్న భోజనం నాణ్యతగా వడ్డించాలని ఏజెన్సీ సభ్యులకు సూచించారు. వారంలో మూడుసార్లు కోడిగుడ్డు ఇవ్వాలన్నారు.

ఇందిరమ్మ ఇళ్లు కాంగ్రెస్‌తోనే సాధ్యం


చిన్నపోతులపాడులో ఇందిరమ్మ ఇళ్లను పరిశీలిస్తున్న సతీష్‌రెడ్డి, మహ్మద్ సిరాజ్

మానవపాడు: గత బీఆర్ఎస్ హయాంలో ఒక డబుల్‌బెడ్రూం ఇళ్లు నిర్మించలేదని, కాంగ్రెస్ ప్రభుత్వంలో నియోజకవర్గానికి 3500 కేటాయించినట్లు రాష్ట్ర రోడ్డు రవాణా మెంబర్ పల్లి సతీష్ రెడ్డి, జిల్లా డీసీసీ కార్యదర్శి మహ్మద్ సిరాజ్ తెలిపారు. సోమవారం మండలంలోని చిన్నపోతులపాడులో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పరిశీలించారు. కార్యక్రమంలో కృష్ణయ్య, శేఖర్, తేజేశ్వర్‌గౌడ్, నాయకులు పాల్గొన్నారు.

పేదలకు ఇళ్ల స్థలాలు లేవు


తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న కేవీపీఎస్ నాయకులు

రాజోళి: మండల కేంద్రంలోనే వందల మంది పేదలకు ఇళ్లు కట్టుకునేందుకు కనీసం స్థలాలు కూడా లేవని కేవీపీఎస్ మండల ప్రధాన కార్యదర్శి విజయ్‌కుమార్ అన్నారు. ఈ మేరకు సోమవారం తహసీల్దార్ పి.రామ్మోహన్‌కు వినతిపత్రం అందజేశారు. రెండు రోజులుగా కేవీపీఎస్ ఆధ్వర్యంలో ఇళ్లు లేని పేదల గురించి సర్వే నిర్వహించామని, వందల మంది పేదలకు కనీసం స్థలాలు కూడా లేవన్నారు. ఇందిరమ్మ ఇళ్లకు దరఖాస్తు చేసుకున్నా కూడా వారికి మేలు జరగలేదన్నారు. అలాంటి వారిని ప్రభుత్వం గుర్తించి ఇళ్ల స్థలాలు కేటాయించి, ఇళ్లను నిర్మించి ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఆశీర్వాదం, నడిపి దేవరాజు, షేక్ షరీఫ్, తదితరులు పాల్గొన్నారు.

ప్రీ ప్రైమరీ స్కూల్ టీచర్లుగా తీసుకోండి


హైదరాబాద్‌లో కమిషనర్ సృజనకు వినతిపత్రం అందజేస్తున్న యూనియన్ సభ్యులు

ధరూరు: అంగన్‌వాడీ సెంటర్లలో పని చేస్తున్న తమను ప్రీ ప్రైమరీ స్కూల్ టీచర్లుగా తీసుకోవాలని అంగన్‌వాడీ టీచర్ల యూనియన్ జిల్లా అధ్యక్షురాలు ఇందిర, వీరమ్మలు కోరారు. ఈ మేరకు తెలంగాణలోని 33 జిల్లాల అంగన్‌వాడీ టీచర్ల యూనియన్ నాయకురాళ్లతో కలిసి సోమవారం హైదరాబాద్‌లోని డైరెక్టర్ కమిషనర్ ఆఫీస్‌లో కమిషనర్ సృజనను కలిసి వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. అంగన్‌వాడీ టీచర్లకు అదనపు పనులు చెప్పొద్దని పేర్కొన్నారు.

వృద్ధులకు ఇంటి వద్దే పింఛన్


వృద్ధుడికి పింఛన్ అందజేస్తున్న పోస్టల్ అధికారి పవన్

శాంతినగర్: వృద్ధులు, నడవలేని వాళ్లకు పోస్టల్ అధికారి ఇంటి వద్దకు వెళ్లి పింఛన్ ఇస్తూ అందరి మన్ననలు పొందుతున్నాడు. వడ్డేపల్లి మున్సిపాలిటీ పరిధిలోని పైపాడులో పోస్టల్ అధికారి పవన్ సోమవారం ఇంటింటికి వెళ్లి వృద్ధులు, వికలాంగులకు పింఛన్లు అందజేశారు. అధికారి మానవత్వంతో ఇంటింటికి వచ్చి పింఛన్ ఇవ్వడంతో ఆయనపై ప్రశంసలు కురిపించారు.

వ్యాధిగ్రస్తుల నమోదు తప్పనిసరి

వీపనగండ్ల: దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న రోగుల పేర్లను ఆన్‌లైన్‌లో తప్పనిసరిగా నమోదు చేయాలని మండల వైద్యాధికారి వంశీకృష్ణ అన్నారు. సోమవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వ్యాధిగ్రస్తుల పేర్లు నమోదు, ఆయూష్మాన్ భారత్ హెల్త్ అకౌంట్ కార్డు, మిషన్ మధుమేహ బెనిఫిషియర్ తదితర అంశాలపై వైద్యసిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎంలు, ఆపరేటర్ రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతుల ప్రదానం


మాచర్లలో బహుమతులు అందజేస్తున్న మాజీ సర్పంచు

గట్టు: మండలంలోని మాచర్ల గ్రామంలో గణేశ్ ఉత్సవాలలో భాగంగా నిర్వహించిన ముగ్గుల పోటీల విజేతలకు సోమవారం బహుమతులు అందజేశారు. ముగ్గుల పోటీల్లో మొత్తం 19 మంది పాల్గొనగా, మొదటి బహుమతి పావని, పరిమళ, ద్వితీయ బహుమతి శ్రావణి, తృతీయ బహుమతి శృతి గెలుపొందారు. వారికి దాతలు తట్టి సీతారాములుశాస్త్రి, పాండురంగ గణేశ్ యూత్, సప్లయర్ జంబన్నలు బహుతులను అందజేశారు. పోటీల్లో పాల్గొన్న వారికి ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వరలక్ష్మి, గ్రామస్తులు యశోదమ్మ, శ్రీనివాసులు, పరమేష్, పాండురంగ గణేశ్ యూత్ సభ్యులు పాల్గొన్నారు. గట్టులోని చేనేత కార్మికులు ఏర్పాటు చేసిన గణేష్ మండపం దగ్గర భక్తులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ఆప్కో మాజీ డైరెక్టర్ దోమ వీరన్న, చేనేత సంఘం సభ్యులు, కార్మికులు పాల్గొన్నారు.

రాహుల్ గాంధీ క్షమాపణ చెప్పాలి


ఇటిక్యాలలో మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

ఇటిక్యాల: బిహార్ రాష్ట్రంలో పర్యటనలో దేశప్రధాని నరేంద్రమోదీ మాతృమూర్తి చేసిన అనుచిత వ్యాఖ్యలపై వెంటనే క్షమాపణ చెప్పాలని బీజేపీ మండలాధ్యక్షుడు షేక్ అబ్దుల్లా అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఈ పార్టీ నాయకులతో కలిసి సమావేశం నిర్వహించి మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు మధుసూదన్‌గౌడ్, కిషోర్, తదితరులు పాల్గొన్నారు.


108 విగ్రహాలను నిమజ్జనానికి తీసుకెళ్తున్న పిల్లలు


వినాయక విగ్రహాలతో స్థానిక మహిళలు


చెన్నిపాడులో అన్నదానం నిర్వహిస్తున్న దౌల్‌బాషా


ఉండవెల్లిలో నిమజ్జనానికి తరలిస్తున్న భక్తులు


ఉండవెల్లిలో గణనాథుడిని ఊరేగిస్తున్న భక్తులు

గంగమ్మఒడికి.. ఏకదంతుడు

రాజోళి మండల కేంద్రంలో సోమవారం వినాయక విగ్రహాల ఊరేగింపు అంగరంగ వైభవంగా నిర్వహించారు. భ్రమరాంబ ఆదివేశ్వర స్వామి ఆలయం దగ్గర కొలువైన వినాయక విగ్రహం దగ్గర భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఇళ్లలో పూజించుకున్న వినాయక విగ్రహాలను తీసుకొచ్చారు. మొత్తం 108 వినాయక విగ్రహాలను ఆదివిస్వామి ఆలయం నుంచి భజనలు, సంకీర్తనలతో ఊరేగిస్తూ తుంగభద్ర నదిలో నిమజ్జనం చేశారు. ■ మానవపాడు మండలంలోని చెన్నిపాడులో వినాయకుడి నిమజ్జనం సందర్భంగా దౌల్‌బాషా అన్నదానం ఏర్పాటు చేశారు. వెంకటేష్, మధు, తదితరులు ఉన్నారు. ■ ఉండవెల్లిలో భక్తులకు అన్నదానం అనంతరం గణనాథుడిని ఊరేగిస్తూ నిమజ్జనానికి తరలించారు. – రాజోళి/మానవపాడు/ఉండవెల్లి